RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | బుధవారం 27 నవంబర్ 2024

సంపుటి: 2 | సంచిక: 198 | పేజీలు: 4 | వెల: రూ.5/-



## డిసెంబర్ 20న రాజ్యసభ ఉప ఎన్నికలు

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): దేశంలోని నాలుగు రాష్ట్రాల్లో ఖాళీ అయిన ఆరు రాజ్యసభ స్థానాలకు డిసెంబర్ 20న ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని మూడు స్థానాలు, ఒడిశా, పశ్చిమబెంగాల్, హర్యానాలో ఒక్కో స్థానానికి ..మిగతా 2లో

# రేవంత్ రెడ్డి సీఎం పదవి
# తుమ్మితే ఊడిపోయే ముక్కు



### కేసీఆర్‌ను తిట్టటమే రేవంత్ ఎజెండా
### ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ విజయం ఖాయం
### దీక్షాదివస్ సన్నాహక సమావేశంలో కేటీఆర్

సిరిసిల్ల, (ప్రభాత సూర్యుడు): ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సరే బీఆర్ఎస్ భారీ విజయం సాధించడం ఖాయమని కేటీఆర్ అన్నారు. సిరిసిల్లలో దీక్షాదివస్ సన్నాహక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రేవంత్ రెడ్డి సీఎం పదవి తుమ్మితే ఊడిపోయే ముక్కు లాంటిదేనని, ఢిల్లీ వాళ్లకు కోపం వస్తే ఆయన పదవి ఊడుతదన్నారు. ఎప్పుడు ఏం జరుగు తుందో చెప్పలేమన్నారు. కానీ నాలుగేళ్లు వేచి ..మిగతా 2లో



## కులగణనతోనే ఆర్థిక, సామాజిక న్యాయం

### రాహుల్ మాట మేరకు తెలంగాణలో విజయవంతం
### ఎఐసిసి సంవిధాన్ రక్షణ అభియాన్ కార్యక్రమంలో సిఎం రేవంత్

న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): తెలంగాణలో ఇచ్చిన మాట ప్రకారం కుల గణన చేపడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సంవిధాన్ రక్షణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు, దళితులకు, ఆదివాసులకు భూ చట్టాలు తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. భారత్ జోడో యాత్ర పేరిట రాహుల్ గాంధీ అన్ని వర్గాల ప్రజలను కలుస్తూ వారి ఇబ్బందులు తెలుసుకున్నారని అన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో రిజర్వేషన్లు అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు గాంధీ పరివార్ ఉందని.. రాహుల్ గాంధీకి అండగా తాము ఉన్నామని వ్యాఖ్యానించారు. రైతుల తరపున నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ ఆందోళన చేశారని.. అందుకే కేంద్రం నల్ల చట్టాలను వెనక్కి తీసుకుందని వివరించారు. తెలంగాణ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా కులగణన చేపట్టింది. కొన్ని చోట్ల ..మిగతా 2లో




## యాదగిరిగుట్టలో డ్రగ్స్ కలకలం

యాదగిరిగుట్ట, (ప్రభాత సూర్యుడు): డ్రగ్స్ మహమ్మారి ఇప్పుడు యాదగిరిగుట్టను కూడా తాకింది. ఎవ్వరూ ఊహించని విధంగా యాదగిరిగుట్ట మండలం రామాజీపేట యాదాద్రి లైఫ్ సైన్సెస్ కెమికల్ ఫ్యాక్టరీలో భారీగా డ్రగ్స్ తయారు చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. పోలీసుల అదుపులో ఆరుగురు నిందితుల ఉన్నట్లు సమాచారం.యాదగిరిగుట్ట నుండి హైదరాబాద్ తరలిస్తుండగా భువనగిరి మండలం గూడూరు టోల్ గేట్ వద్ద పోలీసులకు పట్టుబడ్డ డ్రగ్స్ ముఠా సభ్యులు. గతకొంత కాలంగా గుట్టు చప్పుడు కాకుండా ఎపిడ్రిన్ అనే డ్రగ్ తయారీ చేస్తున్నట్లు సమాచారం.యాదగిరిగుట్ట కేంద్రంగా తయారు చేస్తున్న ఈ డ్రగ్ నీ హైదరాబాద్, ముంబై తరలిస్తున్నట్లు తెలుస్తోంది. నిన్నటి నుండి యాదాద్రి భువనగిరి డిసిపి ఆధ్వర్యంలో సోదాలు కొనసాగుతున్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## డిసెంబర్ 4న పెద్దపల్లిలో సీఎం విజయోత్సవ సభ

### నియామక పత్రాలు అందజేయనున్న సీఎం
### 9 వేల మంది అభ్యర్థులకు అందజేసే అవకాశం



హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న సందర్భంగా డిసెంబర్ 4న పెద్దపల్లిలో నిరుద్యోగ యువతతో విజయోత్సవ సభ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరై గ్రూప్ 4 తో పాటు వివిధ పరీక్షల్లో రిక్రూట్కైన 9 వేల మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడుస్తుండటంతో పెద్దపల్లిలో నిరుద్యోగ యువతతో విజయోత్సవ సభ నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అందుకు పెద్దపల్లి జిల్లా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి డిసెంబర్ 4న పెద్దపల్లి జిల్లాలో పర్యటిస్తారు. ఆ రోజు నిరుద్యోగ యువతితో భారీ బహిరంగ సభ నిర్వహించి ఇటీవల వివిధ పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ఉద్యోగాలకు ఎంపికైన 9 వేల మంది ..మిగతా 2లో



## సామాన్యుల జీవితాలు మెరుగవ్వాలి

### రాజ్యాంగ స్ఫూర్తి చెప్తున్నది ఇదే
### కార్యనిర్వాహక, న్యాయ, శాసన వ్యవస్థలు కలిసి పని చేయాలి
### రాజ్యాంగ దినోత్సవంలో రాష్ట్రపతి

న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): రాజ్యాంగస్ఫూర్తికి అనుగుణంగా సామాన్య ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు కార్యనిర్వాహక, న్యాయ, శాసన వ్యవస్థలు కలిసికట్టుగా పని చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏండ్లు అవుతున్న సందర్భంగా మంగళవారం పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో జరిగిన రాజ్యాంగ దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాజ్యాంగ దినోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును లోక్‌సభ ప్రతిపక్ష నేత ..మిగతా 2లో

## ఈవీఎంలు వద్దు.. బ్యాలెట్ పేపరే కావాలి

### ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లతో ఓటింగ్‌లో అవకతవకలు
### బ్యాలెట్ పేపర్ ఓటింగ్ అవసరంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తాం
### కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లతో ఓటింగ్‌లో అవకతవకలు జరుగుతున్నాయని, వాటికి బదులుగా ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్స్‌నే వినియోగించాలని కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈవీఎంలలో ఎలాంటి లోపాలు లేవని, ..మిగతా 2లో



## పాకిస్థాన్‌లో హింసాత్మకంగా నిరసనలు

### ఆరుగురు భద్రతా సిబ్బంది మృతి
### ఆర్మీకి షూట్ ఎట్ సైట్ ఆర్డర్స్



ఇస్లామాబాద్, (ప్రభాత సూర్యుడు): పాకిస్థాన్ మాజీ ప్రధాని, తెహ్రీక్ -ఏ- ఇన్సాఫ్ (పీటీఐ) అధినేత ఇమ్రాన్ ఖాన్‌ను జైలు నుంచి విడుదల చేయాలంటూ ఆ పార్టీ మద్దతుదారులు చేపట్టిన భారీ నిరసన హింసాత్మకంగా మారింది. ఈ ఘటనలో నలుగురు పారామిలిటరీ సిబ్బంది, ఇద్దరు పోలీసులు మృతి చెందారు. దాదాపు 100మంది సెక్యూరిటీ సిబ్బంది గాయపడ్డారు. నిరసనలు హింసాత్మకంగా మారడం వల్ల, రాజధాని ఇస్లామాబాద్ ప్రాంతంలో ప్రభుత్వం భద్రతా చర్యలు కట్టుదిట్టం చేసింది. కనిపిస్తే కాల్చేయమని ఆర్మీకి ఆదేశాలు జారీ చేసింది. దీంతో ముందు జాగ్రత్తగా రాజధాని ఇస్లామాబాద్?లోని విద్యాసంస్థలకు మంగళవారం సెలవు ప్రకటించారు. మంగళవారం కూడా పీటీఐ మద్దతుదారుల నిరసనలు కొనసాగుతున్నాయి. ఇస్లామాబాద్, రావల్పిండికి వెళ్లే ప్రధాన రహదారులను ..మిగతా 2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# జీడిమెట్ల పారిశ్రామిక వాడలో భారీ అగ్ని ప్రమాదం

## ప్లాస్టిక్ బ్యాగుల తయారీ పరిశ్రమలో పెద్ద ఎత్తున మంటలు



హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): జీడిమెట్ల పారిశ్రామి వాడలో మంగళవారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ప్లాస్టిక్ బ్యాగుల తయారీ పరిశ్రమలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలు ఆర్పుతున్నారు. నాలుగు ఫైరింజన్‌లు, ఆరు వాటర్ ట్యాంకర్‌ల సాయంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. మధ్యాహ్నం నుంచి ఆరు గంటలుగా మంటలను అదుపులోకి తెచ్చేందుకు ఫైర్ సిబ్బంది ప్రయత్నిస్తున్నా ఇప్పటికి మంటలు అదుపు కాలేదు. ఘటనా స్థలంలో పరిస్థితిని జీడిమెట్ల సీఐ, బాలనగర్ ఏసీపీ పర్యవేక్షిస్తున్నారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం లేదని పోలీసులు తెలిపారు. అయితే భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందని చెప్పారు. ప్రమాదానికిగల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

# రేవంత్ రెడ్డి సీఎం పదవి తుమ్మితే ఊడిపోయే ముక్కు



మొదటి పేజీ తరువాయి...

చూడాల్సిం దేనన్నారు. సిరిసిల్లలో ప్రజలు ఛీ కొట్టిన సరే అధికారులను అడ్డం పెట్టుకొని ఎగురుతున్న కాంగ్రెస్ సన్నాసులను గుర్తుపెట్టు కుంటామన్నారు. మొన్న సీఎం వేములవాడకు వచ్చాడని నాలుగు మంచి మాటలు చెబుతాడనుకున్నాన న్నారు. బాలల దినోత్సవమైనా, రాజీవ్ సద్భావన యాత్ర అయినా, ఆయన పుట్టిన రోజు అయినా వేములవాడలో మీటింగ్ అయినా సరే కేసీఆర్‌ను తిట్టటమే పని అని,దేవుళ్ల మీద ఒట్లు, హామీలకు తూట్లు, కేసీఆర్‌పై తిట్లు ఇవి తప్ప నువ్వేం పీకినవ్ అంటూ మండిపడ్డారు. ప్రజల దగ్గరకు పోతే జనాలను సీఎంను ఛీ కొట్టే పరిస్థితి ఉందన్నారు. కొడంగల్‌లో రైతులకు దగ్గరకు వెళ్లలేని పరిస్థితి రేవంత్‌ది అంటూ విమర్శించారు.నేరెళ్లలో ఒక సంఘటన జరిగిందని, బాధితుల కు న్యాయం చేసేందుకు తాను ప్రయత్నం చేశానన్నారు. వాళ్ల ను కలిశానని వీల్కెనంత వరకు సాయం చేశానన్నారు. మీరు రాజకీయం చేసే ప్రయత్నం చేశారని నెరేళ్ల ప్రజలంతా మొన్నటి ఎన్నికల్లో మాకే అత్యధిక ఓట్లు వేశారన్నారు. ప్రజాస్వామ్యంలో పాలకులు అంటే ప్రజలతో తిట్లు తిన్నా సరే వారి మనసు గెలుచుకునే ప్రయత్నం చేయాలంటూ చురక లంటించారు. కొడంగల్‌లో రైతులు ఏం అడిగారు. తమ భూ ములకు ఎక్కువ డబ్బులు ఇవ్వాలని కోరారన్నారు. తొమ్మిది నెలలుగా నిరసన చేస్తున్నారని ధర్నాలు చేస్తున్నారన్నారు. అయినా వాళ్లకు సీఎం సమయం ఇవ్వలేదన్నారు. సీఎం తమ్ముడు, మంత్రులు ఎవ్వరూ వాళ్ల బతిమాలినా పట్టించు కోలేదన్నారు. ఆఖరికి కలెక్టర్ ప్రజాభిప్రాయ సేకరణకు వెళితే నిరసన తెలిపారని, అదే రేవంత్ రెడ్డి పోయి ఉంటే ఉరికించి ఉరికించి కొట్టేవారన్నారు. సీఎం కేవలం అదానీ, తన అన్న, అల్లుడు, బావమరిదికి అమృతం పంచేందుకు మాత్రమే పని చేస్తున్నాడని ప్రజల కోసం ఏమీ చేయలేదంటూ మండిపడ్డారు. 28 సార్లు ఢిల్లీకి పోయిండని, ఫ్లైట్ ఛార్జీలు వృథా తప్ప 28 రూపాయలు కూడా తీసుకురాలేదనన్నారు. ఎనిమిది 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచారని వారంతా 8 రూపాయల నిధులు లేదన్నారు. ప్రజ లందరూ కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న పనులను గమనిస్తున్నా రన్నారు. హైదరాబాద్‌లో ఓ ఆటో డ్రైవర్‌తో మాట్లాడితే ఈ ప్రభుత్వం పోయేందుకు ఏదైనా ఉపాయం లేదా అడుగుతున్నాడన్నారు. ఒకసారి ఓటు వేస్తే ఐదేళ్లు శిక్ష పడాలని అంటున్నాడని తప్పదు మరో నాలు గేళ్లువీళ్లు పీక్క తింటూనే ఉంటారన్నారు. ఈ ముఖ్యమంత్రికి కనీస అవగాహన, పరిజ్ఞానం కూడా లేదన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా సిరిసిల్లలో నేతన్నలు ఉన్నారన్నారు. మరి ఇక్కడ పెట్టాల్సిన నూలు డిపోను తీసుకొని పోయి వేముల వాడలో పెట్టిండంటూ ప్రశ్నించారు. గుండుకు దెబ్బ తాకితే మోకాలి మందు పెట్టినట్లుగా ఉందన్నారు. ఇంతా తెలివైన వాళ్లు ఉండటం మన అదృష్టమ న్నారు. ఏడాది పాలనలో ముఖ్యమంత్రిని ప్రజలు ఇన్ని తిట్లు తిట్టటం నేను ఎప్పుడు చూడలేదన్నారు. మీడియా, యూట్యూబ్ వాళ్లు మైక్ పెడితే చాలు ఏమాత్రం సంకోచించకుండా రేవంత్ రెడ్డిని పొట్టు పొట్టు తిడుతున్నార న్నారు. ఆ తిట్లు విన్నాక రేషం ఉన్నోడైతే బిల్డింగ్ మీది నుంచి దూకి చస్తాడన్నారు. కానీ, రేవంత్ రెడ్డి కాబట్టి నడిచిపోతోందన్నారు. ఏడాదిలోపే ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత ఊహించలేదన్నారు. మనం పిలుపునిస్తే ఈ ప్రభుత్వానికి ప్రజలే సంవత్సరీకం పెట్టే పరిస్థితి ఉందన్నారు. అమ్మ విలువ, అన్నం విలువ లేనప్పుడే మనకు తెలుస్తుందన్నారు. అదే విధంగా ఇప్పుడు గ్రామ గ్రామాన కేసీఆర్ గురించే మాట్లాడుతున్నారు. హైదరాబాద్‌లో నాచారంలోని చెప్పుల దుకాణం, హుజుర్‌నగర్‌లో నాయీ బ్రహ్మణుడి షాప్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం తొలగిస్తుంటే వాళ్లు కేసీఆర్ ఎక్కడ ఉన్నావంటూ గుర్తు చేసుకుంటున్నారన్నారు. ఎప్పుడు ఎలక్షన్ వస్తుందా కాంగ్రెస్‌ను ఎప్పుడు పాతర పెడదామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు.2001 నుంచి ఇక్కడ జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండానే ఎగిరిందని, మళ్లీ బీఆర్ఎస్ గెలుపు ఖాయమన్నారు. ప్రజల్లో కేసీఆర్ పట్ల ఎనలేని వాత్సల్యం, ప్రేమ ఉందన్నారు. దాన్ని ఎలా అనుకూలంగా మలుచుకోవాలన్నదే మనం చేయాల్సిన పనన్నారు. మనుషులుగా మనం కూడా తప్పులు, పొరపాట్లు చేసి ఉండవచ్చని వాటి నుంచి ఏం నేర్చుకున్నామన్నదే ముఖ్యన్నారు. ఆనాడు 'కేసీఆర్ సచ్చుడో తెలంగాణ తెచ్చుడో' అని కేసీఆర్ ఏ విధంగా తెలంగాణ తెచ్చారో గుర్తు చేసుకోవాలని సూచించారు. కేసీఆర్ స్ఫూర్తితో కాంగ్రెస్, బీజేపీకి వ్యతిరేకంగా మహా సంకల్ప దీక్ష చేయాల్సి ఉందన్నారు. తెలంగాణ తెచ్చిన దానికన్నా కేసీఆర్‌కు వచ్చే పెద్ద పేరు ఇంకేమీ లేదన్నారు. తెలంగాణ ఆడబిడ్డలు, తెలంగాణ రైతులు, నేతన్నలు, వృద్ధులు, తెలంగాణ ప్రజానీకానికి మేలు జరగాలంటే కేసీఆర్ కావాలన్నారు. విడిపోతే చెడిపోతాం అంటూ మొన్న మహారాష్ట్ర ఎన్నికల్లో ఒక నినాదం బాగా పాపులర్ అయ్యిందని మనం కూడా ఎన్నికలు వస్తే విడిపోకుండా జాగ్రత్త పడాలని కోరారు. లేకపోతే అన్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణ మీద గులాబీ జెండాకు ఉన్న ప్రేమ ఢిల్లీ పార్టీలకు ఉండదని కేసీఆర్ మాత్రమే తెలంగాణ మట్టి మనిషి అవుతాడని కాంగ్రెస్, బీజేపీ నేతలు ఢిల్లీ మనుషులేనన్నారు. మన నాయకుడి పోరాటం, తెలంగాణ విద్యార్థుల బలిదానాన్ని దీక్షా దివస్ సందర్భంగా మరోసారి గుర్తు చేసుకోవాల్సి ఉందన్నారు. ఆనాడు తెలంగాణ ఇయ్యాక తప్పని పరిస్థితిని తీసుకొచ్చింది కేసీఆర్ అని, నవంబర్ 29, 2009 నాడు కేసీఆర్ అనే బక్క మనిషి, ఉక్కు సంకల్పంతో చేపట్టిన దీక్ష కారణంగానే తెలంగాణ సాధ్యమైందని స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పాటైన జూన్ 2వ తేదీ ఎంత ముఖ్యమో, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కీలక మలుపు అయిన దీక్షా దివస్ నవంబర్ 29 అంతే ముఖ్యమన్నారు. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 9 వ తేదీ వరకు పదకొండు రోజులు జరిగిన దీక్ష కారణంగా అనివార్యంగా తెలంగాణ ఇవ్వాల్సి వచ్చిందన్నారు. ఏ రోజైతే తెలంగాణ ప్రకటన వచ్చిందో అదే డిసెంబర్ 9వ తేదీని విజయ దివస్‌గా జరుపుకుందామన్నారు. కాగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు హెచ్చరికలు జారీ చేశారు. బీఆర్ఎస్ నాయకులను పార్టీ మారాలని చెబుతున్నారట అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు రాజ్యాంగ దినోత్సవమని, బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో ఆర్టికల్-3 ద్వారానే తెలంగాణ సాధ్యమైందన్నారు. అందుకే తెలంగాణ ప్రజలంతా ఆయనకు రుణపడి ఉంటారన్నారు. ఆయన చూపిన బాటలోనే బోధించు, పోరాడు, సమీకరించు అన్న విధానంలోనే కేసీఆర్ పోరాటం చేసి తెలంగాణ సాధించారని గుర్తు చేశారు.

# ఈవీఎంలు వద్దు.. బ్యాలెట్ పేపరే కావాలి

మొదటి పేజీ తరువాయి...

ఈవీఎంలకు వ్యతిరేకంగా వచ్చే ఫిర్యాదులను తాము ఎంటర్‌టైన్ చేయదల్చుకోలేదని కేఏ పాల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన రోజే ఖర్గే ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.'ఈవీఎంలను పక్కన పెట్టాలంటే మనం అందరం ఒక్కతాటిపైకి రావాల్సిన అవసరం ఉంది. నేను ఎన్నికల గురించి మాట్లాడాలనుకోవడం లేదు. అయితే ఈవీఎంల కారణంగా పేద, బడుగు బలహీన వర్గాల ఓట్లు వృథా అవుతున్నాయి. వాళ్లంతా బ్యాలెట్ పేపర్ ఓటింగ్‌నే కోరుకుంటున్నారు' అని ఖర్గే చెప్పారు. ఢిల్లీలోని తల్కతోరా స్టేడియంలో జరిగిన సంవిధాన్ రక్షక్ అభియాన్ కార్యక్రమంలో ఖర్గే మాట్లాడారు. 'ఈవీఎంలు వాళ్ల దగ్గరే పెట్టుకోనివ్వండి. మాకు ఈవీఎంలు వద్దు. మేం బ్యాలెట్ పేపర్‌తో జరిగే ఓటింగ్‌ను కోరుకుంటున్నాం.' అని ఖర్గే అన్నారు. బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ కోసం రాహుల్‌గాంధీ మరోసారి భారత్ జోడో యాత్ర చేయాలని ఖర్గే కోరారు. బ్యాలెట్ పేపర్ ఓటింగ్ అవసరంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని అన్నారు. అందుకోసం ఇతర రాజకీయ పార్టీలతో కూడా మాట్లాడుతామని చెప్పారు.

# పాకిస్థాన్‌లో హింసాత్మకంగా నిరసనలు

మొదటి పేజీ తరువాయి...

మూసివేసిన ప్రభుత్వం, పెద్దఎత్తున భద్రతబలగాలను మోహరించింది. ఆయా నగరాలకు వెళ్లే రైళ్లు, మెట్రో బస్సుల సర్వీసులను కూడా నిలిపివేసింది. ఇస్లామాబాద్‌లోకి ప్రవేశించకుండా అడ్డుకున్న పోలీసులపై ఆందోళనకారులు దాడి చేశారు. ఈ ఘనటలో ఐదుగురు భద్రతాసిబ్బంది మృతి చెందారు. మరోవైపు పంజాబ్ ప్రావిన్స్‌లో ఒక పోలీసు అధికారి మరణించగా, మరో 119మంది తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు తెలిపారు. 22 పోలీసు వాహనాలకు నిప్పంటించారని చెప్పారు. ఆందోళనకారుల్లో నలుగురు మృతి చెందినట్లు ప్రకటించారు. ఇమ్రాన్ భార్య బుష్రాబీబీ నేతృత్వంలో ఆదివారం మొదలైన నిరసన ప్రదర్శన ఇస్లామాబాద్ చేరింది. ఇమ్రాన్ జైలు నుంచి విడుదలయ్యాకే తాము ఇంటికి వెళ్తామంటూ ఆయన భార్య బుష్రాబీబీ పేర్కొనటం వల్ల పీటీఐ శ్రేణులు బ్యారికేడ్లను దాటుకొని ఇస్లామాబాద్‌లోకి ప్రవేశించారు. ఆందోళనకారులను అడ్డుకున్న పోలీసులపై హింసాత్మక దాడులకు పాల్పడుతున్నారు. దీంతో ఆందోళనకారులపై పోలీసులు లాఠీఛార్జీ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే భద్రతా సమస్యలు ఉన్న ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను ప్రభుత్వం నిలిపివేసింది. అయితే ఇది ఎంతకాలం ఉంటుందని స్పష్టం చేయలేదు. పీటీఐ అధినేత ఇమ్రాన్‌ఖాన్ 150కి పైగా క్రిమినల్ కేసుల్లో జైల్లో ఉన్నారు.

# రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రత

## సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 9.3 డిగ్రీలుగా నమోదు

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): తెలంగాణలో రోజు రోజుకు చలి తీవ్రత పెరుగుతున్నది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 15 డిగ్రీలలోపు కనిష్ఠ రాత్రి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో చలి ఎకువగా ఉన్నదని వాతావరణ శాఖ తెలిపింది. ఇక ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలుచోట్ల ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 9.3 డిగ్రీలు నమోదయింది. అదేవిధంగా న్యాల్కల్‌లో 9.6 డిగ్రీలు, గుమ్మడిదలలో 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది. ఇక మెదక్ జిల్లా శివ్వంపేటలో 10 డిగ్రీలు, సిద్దిపేట జిల్లా పోతిరెడ్డిపేటలో 10.2 డిగ్రీలు నమోదయింది. సోమవారం రాష్ట్రంలోనే అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రికార్డయిన విషయం తెలిసిందే. సిర్పూర్(యూ)లో రికార్డు స్థాయిలో 8.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో అత్యల్పంగా 8.8, ఆదిలాబాద్ జిల్లా బేలలో 9.9 డిగ్రీలు నమోదైంది. జోగులాంబ గద్వాలలో 15.1, సూర్యాపేటలో 15.6, వనపర్తిలో 15.9 డిగ్రీలుగా నమోదైంది. తూర్పు, ఈశాన్య ప్రాంతాల నుంచి రాష్ట్రం వైపు గాలులు వీస్తుండటమే చలి తీవ్రత పెరగటానికి కారణమని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా రానున్న మూడ్రోజులు చలి తీవ్రత మరింత అధికంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆసిఫాబాద్, సంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లో 10 డిగ్రీలలోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగిలిన 27 జిల్లాల్లో 15 డిగ్రీల లోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ప్రతి ఏడాది డిసెంబర్‌లో ఉష్ణోగ్రతలు తకువ స్థాయికి పడిపోతుంటాయి. ఈ ఏడాది కొన్ని జిల్లాల్లో నవంబర్‌లోనే చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. పదేళ్లతో పోల్చితే ఈ నెల 23న రాత్రి నాలుగు జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు.

# సామాన్యుల జీవితాలు మెరుగవ్వాలి

మొదటి పేజీ తరువాయి...

రాహుల్ గాంధీ అవమానించారని బీజేపీ ఆరోపించింది. ఇందుకు సంబంధించి రెండు వీడియోలను 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. వేదికపై రాష్ట్రపతి కూర్చోకముందే రాహుల్ గాంధీ కూర్చున్నట్టుగా, మల్లికార్జున ఖర్గే.. ఆయనను నిలబడాల్సిందిగా సూచిస్తున్నట్టుగా ఒక వీడియో ఉంది. మరో వీడియోలో ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కర్, ప్రధాని మోదీ, ఖర్గే రాష్ట్రపతికి నిలబడి నమస్కరిస్తుండగా, రాహుల్ గాంధీ నమస్కరించనట్టుగా కనిపిస్తున్నది.

# కులగణనతోనే ఆర్థిక, సామాజిక న్యాయం

మొదటి పేజీ తరువాయి...

కుటుంబాలున్నాయని.. ఇళ్లను 87,092 ఎన్యూమరేషన్ బ్లాక్‌లుగా విభజించి కులగణన చేపట్టినట్లు రాష్ట్ర ప్రణాళిక శాఖ తెలిపారు. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం కాంగ్రెస్?తోనే సాధ్యమని, రాహుల్ గాంధీ నాయకత్వంలో అందరికి సామాజిక న్యాయం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, లోక్ సభ పక్ష నేత రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తదితర కీలక నేతలు హాజరయ్యారు. దేశంలో రాజ్యాంగ పవిత్రతను కాపాడిరది కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. గాంధీ పరివార్ రాజ్యాంగాన్ని కాపాడే ప్రయత్నం చేస్తుంటే.. మోడీ పరివార్ రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేస్తోందని ÷ర్ అయ్యారు. రాజ్యాంగ పరిరక్షణలో రాహుల్ గాంధీ వెంట దేశ ప్రజలంతా ఉన్నారన్నారు. ప్రతి ఒక్క వర్గానికి కాంగ్రెస్ పార్టీ న్యాయం చేసిందని.. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు కాపాడిరది కాంగ్రెస్సేనని వ్యాఖ్యానించారు. కుల గణనతోనే ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులు తెలుస్తాయని.. ఇందుకోసమే దేశవ్యాప్తంగా కుల గుణన కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని తెలిపారు. దేశంలో సామాజిక న్యాయాన్ని అందించింది ఒక్క కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట ప్రకారమే తెలంగాణలో కుల గణన చేపట్టామని.. కుల గణన సర్వే ఇప్పటి వరకు 92 శాతం పూర్తి అయ్యిందని వెల్లడిరచారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే జన గణన సర్వేలోనూ కులాల లెక్కలు తీయాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

# డిసెంబర్ 20న రాజ్యసభ ఉప ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి...

ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలకు డిసెంబర్ 3న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న స్క్రూటినీ, 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. డిసెంబర్ 20న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరుగుతుంది. అదేరోజు సాయంత్రం 5 గంటలకు కౌంటింగ్ ప్రారంభించి తుది ఫలితాలను ప్రకటిస్తారు.

## డిసెంబర్ 4న పెద్దపల్లిలో

# సీఎం విజయోత్సవ సభ

మొదటి పేజీ తరువాయి...

అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. అందుకు భారీ బహిరంగ సభకు అనువైన స్థలాన్ని అధికారులు పరిశీలించారు. పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా అధికారులతో కలిసి పెద్దకల్వల లోని సమీకృత జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని, పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. సభా స్థలాన్ని పరిశీలించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవం వేడుకలను డిసెంబర్ 1 నుంచి డిసెంబర్ 9 వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పండగ వాతావరణంలో జరపాలని ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. అందులో భాగంగా డిసెంబర్ 4న పెద్దపెల్లి జిల్లాలో నిరుద్యోగ యువతతో విజయోత్సవ సభ జరుపుతుందని తెలిపారు. నిరుద్యోగ విజయోత్సవ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై గ్రూప్ 4, ఇతర వివిధ పోటీ పరీక్షలకు కింద ఎంపికైన 9 వేల మది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. సీఎం టూర్ ప్రజా పాలన విజయోత్సవ సభ సందర్భంగా ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ పెద్దకల్వలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు చేసిన ధాన్యం తరలింపు వెంటనే జరిగేలా చూడాలని ఆదేశించారు. నాణ్యమైన ధాన్యాన్ని త్వరగా కాంటా వేసి కొనుగోలు చేయాలని సూచించారు. ధాన్యం డబ్బులు రైతులకు సకాలంలో చెల్లించేలా వివరాలను ఓపిఎంఎస్ లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# రామగుండంలో రూ. కోటి 30 లక్షల గంజాయి దహనం



రామగుండం, (ప్రభాత సూర్యుడు): పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో పట్టుబడ్డ రూ.కోటి 30 లక్షల విలువగల గంజాయిని డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో మానకొండూరు వద్ద పోలీసులు దహనం చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ 2021 నుంచి వివిధ పోలీసు స్టేషన్‌లలో నమోదైన 64 కేసుల్లో నిందితుల నుంచి 521.544 కిలోల ప్రభుత్వ నిషేధిత గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఎన్‌డీపీఎస్ చట్ట ప్రకారం కోర్టు అనుమతి తీసుకుని, న్యాయాధిపతుల ముందు కేసు ప్రాపర్టీని ఎఫ్ఎస్ఎల్ కోసం శాంపిల్ తీసి మిగిలిన మొత్తాన్ని వెంకటరమణ ఇన్సినేటర్ ఫ్యాక్టరీ వద్ద పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తూ దహనం చేశామన్నారు. దహనం చేసిన నిషేధిత గంజాయి విలువ సుమారు రూ. 1,30,38,600 వివరించారు. అక్రమార్జనలో భాగంగా గంజాయి సాగు, విక్రయిస్తూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రలోభాలకు గురి చేస్తూ మత్తులోకి దించుతున్నారన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారిని అరికట్టడం కోసం స్థానిక, స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసుల ద్వారా విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఎవరైనా గంజాయి , ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# డిసెంబర్ 1న హైదరాబాదులో జరిగే మాలల సింహ గర్జన సభను విజయవంతం చేయండి


**చిలుకూరు (ప్రభాత సూర్యుడు):** ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మరియు రాజ్యాంగ హక్కులను కాపాడుకోవడానికి అన్ని మాల సంఘాలు కలిసికట్టుగా డిసెంబర్ 1వ తేదీన హైదరాబాద్ మహానగరం పరేడ్ గ్రౌండ్ లో జరిగే మాలల సింహగర్జన సభకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి మాల సంఘాలు మరియు మాలల ఉప కులాలు లక్షలాదిగా తరలివచ్చి సింహ గర్జన సభను జయప్రదం చేయాలని మాల మహానాడు నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం రోజున చిలుకూరు మండల కేంద్రంలో ఆర్ఎన్ఆర్ కాలనీలో మాల మహానాడు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిలుకూరు మండలం మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ డిసెంబర్ ఒకటవ తేదీన ఖింజానా (పరేడ్) మైదానంలో జరుగు మాలల సింహగర్జన సభకు విద్యార్థులు,మహిళలు, ఉద్యోగ, మేధావులు, చిన్న పెద్ద తేడా లేకుండా కలిసికట్టుగా స్వచ్ఛందంగా లక్షలాదిగా తరలి రావాలని కోరారు. రాజ్యాంగ హక్కులను, మన రిజర్వేషన్లను కాపాడుకోవడానికి మాల, మాల ఉప కులాలు అన్ని కలిసికట్టుగా మన ఆత్మగౌరవం కోసం మన బల ప్రదర్శన సత్తా చాటాలన్నారు. సమావేశ అనంతరం ఇట్టి బహిరంగ సభకు సంబంధించి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు మాదాసు రాజు, చేవూరు కొండలు, మాదాసు చిన్న ముత్యాలు, బాదే తిరపయ్య, బండ్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# భారతీయులకు పవిత్ర గ్రంథం రాజ్యాంగం

## ప్రిన్సిపల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్







పటాన్ చెరువు ఏపీజే అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల బోధన బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు

**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** భారతీయులకు పవిత్ర గ్రంథం బాబాసాహెబ్ అంబేద్కర్ నేతృత్వం లో రచించిన భారత రాజ్యాంగం అని పటాన్ చెరువు లోని ఏ పీ జే అబ్దుల్ కలాం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ “హమారా సంవిధాన్ హమారా స్వాభిమాన్” పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంవత్సరం పొడవున భారత రాజ్యాంగ దినోత్సవాలను జరుపుతున్నాయని అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భారత పౌరులకు రాజ్యాంగం కల్పించిన ఫలాల విషయాలను, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడే పాలన చేయాలనే భారత రాజ్యాంగ దినోత్సవం ముఖ్య ఉద్దేశమని అన్నారు.రాజ్యాంగం పట్ల ప్రజలకు అవగాహన కల్పించడమే దినోత్సవ ముఖ్య ప్రాముఖ్యత అని అన్నారు. దేశంలో కుల, మత, ప్రాంతీయ, భాష లకు తావు లేకుండా అన్ని వర్గాల ప్రజలను, ప్రాంతాల ను ఏకదృష్టి తో చూసి ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో వెనుకబాటుకు గురి అయిన దేశ ప్రజలను సమానంగా చూసి ఆయా వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలియచేయడమే రాజ్యాంగ దినోత్సవ ముఖ్య ఉద్దేశం అని అన్నారు .ప్రపంచంలోనే లిఖిత రాజ్యాంగాలలో భారత దేశ రాజ్యాంగానికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉన్నదని అన్నారు. రాజ్యాంగం ప్రకారమే ప్రజలు చట్టాలుకు లోబడి వ్యవహరించాల్సి ఉంటుందని అన్నారు. పటాన్చెరువు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారత రాజ్యాంగ దినోత్సవ అవగాహన సదస్సుకు కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఏ వెంకటేశం, డాక్టర్ బి కరుణ కుమారి, అధ్యాపకులు డాక్టర్ పూనం కుమారి,జి మల్లిక, డాక్టర్ బేబీ రమణి, డాక్టర్ మంజుశ్రీ, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ షరీఫ్ మియా లతో పాటు డిగ్రీ కళాశాల విద్యార్థిని,విద్యార్థులుపాల్గొని భారత రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



# ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థినిలకు ఆల్ ఇన్ వన్‌లను బహుకర్ణ

## తోపుడు బండి పౌండేసన్ వారి ఆధ్వర్యంలో...

**కల్లూరు -ప్రభాత సూర్యుడు:** తోపుడు బండి ఫౌండేషన్ అధినేత్రి దయ్యాల ఉషా సాదిక్ అందజేయడం జరిగినది. వారు టెన్త్ క్లాస్ పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ పిల్లలు అందరూ చదువును ఇష్టంతో చదవాలి కష్టంతో కాదు అని అన్నారు. విద్యార్థినిలు మంచిగా చదివి స్కూల్ కి మంచి పేరు తేవాలని కోరారు. విద్యకు సంబంధించి ఏమి కావాలన్నా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు, అంతేకాకుండా పాఠశాలలో ప్యూరిఫైడ్ వాటర్ కి సంబంధించిన ప్లాంటును కూడా త్వరలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పిల్లలు మంచిగా చదివి ప్రయోజకులు అయితే చాలా సంతోషం అని అన్నారు. ఈ కార్యక్రమంలో దయ్యాల ఆశ, శ్యామల ,దయ్యాల కిషోర్ దత్ సామాజిక కార్యకర్త, కల్లూరు గ్రామపంచాయతీ మాజీ వార్డ్ మెంబర్ షేక్ అఫ్రోజ్, వీరరాఘవయ్య, రామారావు టీచర్, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఒక కోటి యాభై లక్షలు ఈ.జి.యస్ నిధులతో తల్లాడ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

## శ్రీకారం చేసిన నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్






**తల్లాడ ప్రభాత సూర్యుడు:** మండలపరిధిలో నారయ్య బంజర్ గ్రామం - నారయ్య బంజర్ గ్రామం లో 3.50 లక్షలు ఈ.జి.యస్ ప్రభుత్వ నిధులతో క్యాటిల్ షెడ్ ( పశువుల షెడ్) శంకుస్థాపన చేసిన సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్.

**తల్లాడ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమంలకు ఒక కోటి 50 లక్షలు**

ఈ. జి.యస్ ప్రభుత్వ నిధులతో తల్లాడ మండలం లో 9 క్యాటిల్ షెడ్స్, 27 నర్సరీ లు,1 నాడేపు కంపోస్ట్ లు,గల్లి కంట్రోల్ వర్క్ లు 2,డ్రిప్ హార్టికల్చర్ 3 ఎకరాలు, చెక్ డ్యామ్ 1,ఫార్మ్ పాండ్స్ 5, రూఫ్ టాప్స్ 5,యం స్ పిట్స్ 10, గ్రామపంచాయతీ బిల్డింగ్ 1,స్కూల్ టాయిలెట్స్ 1,సీసీ రోడ్స్ 1 కె.యం , ఆజోలా కన్స్ట్రక్షన్స్ 20,పౌల్ట్రీ షెడ్ 1, మొత్తం 76 వర్క్స్ లకు అభివృద్ధి కార్యక్రమాలు గ్రామాల్లో చేపట్టటం జరుగుతుంది అని తెలియజేసిన ఎమ్మెల్యే. కొత్త నారాయ బంజర్ గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం లో చేపట్టిన గ్రామ అభివృద్ధి గ్రామ ప్రజలకు వివరించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సంవత్సర పాలనా కాలంలో తెలంగాణ అభివృద్ధి సంక్షేమ పథకాలకు ప్రజలు సంతృప్తిగా ఆనందంగా ఉన్నారు. ఈ కార్యక్రమం లో కల్లూరు, పెనుబల్లీ మార్కెట్ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, సీనియర్ నాయకులు,ప్రభుత్వ అధికారులు ఆర్ డి ఓ,తహసీల్దార్ ,ఎంపీడీఓ,డి ఆర్ డి ఈ,ఏ.ఈ,, ఎంపీవో , సెక్రటరీ, తల్లాడ మండలం,గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.




భారత రాజ్యాంగం నిర్మాణ దినోత్సవం సందర్భంగా పాఠశాల చిన్నారులతో మానవ హారంలో పాల్గొన్న ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్

**కల్లూరు ప్రభాత సూర్యుడు:** మండలపరిధిలో కొత్త యర్రబోయిన పల్లి గ్రామం లో భారత రాజ్యాంగం నిర్మాణ దినోత్సవం సందర్భంగా యర్రబోయినపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాల చిన్నారులతో కలిసి డాక్టర్ భీ.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, పాఠశాల చిన్నారులతో కలిసి రాజ్యాంగ ప్రతిజ్ఞ చేసిన సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్. అనంతరం కల్లూరు ఏ ఎమ్ సి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి,ఆర్ డి ఓ , ఎంపీడీఓ, సీడీపీఓ, డి ఈ, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, ప్రభుత్వ అధికారులు మరియు సీనియర్ నాయకులు పసుమర్తి చంద్రరావు, యర్రబోయినపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు తో కలిసి మానవ హారం లో పాల్గొన్న సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్.



# ఒక కోటి 50 లక్షలు ఈ. జి. యస్ నిధులతో కల్లూరు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన

## శంకుస్థాపన చేసిన సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్





**కల్లూరు-ప్రభాత సూర్యుడు:** మండలపరిధిలో కొత్త యర్రబోయిన పల్లి గ్రామంపంచాయి తి లో 18 లక్షలు ఈ. జి. యస్ ప్రభుత్వ నిధులతో నూతన అంగన్వాడీ భవనం శంకుస్థాపన చేసిన సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే. నియోజకవర్గం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లి నియోజకవర్గం లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టటం జరుగుతుంది అని తెలియజేసారు. కల్లూరు మండలం లో ఒక కోటి 50 లక్షలు ఈ.జి.యస్ ప్రభుత్వ నిధులతో కల్లూరు మండలం లో 10 క్యాటిల్ షెడ్స్, 31నర్సరీ లు, 10 నాడేపు కంపోస్ట్ లు, గల్లి కంట్రోల్ వర్క్ లు 2, డ్రిప్ హార్టికల్చర్ 5 ఎకరాలు, చెక్ డ్యామ్ 1, ఫార్మ్ పాండ్స్ 5, రూఫ్ టాప్స్ 5, యంస్ పిట్స్ 10, గ్రావెల్ రోడ్స్ 4 కె.యం, గ్రామ పంచాయితీ బిల్డింగ్ 1,స్కూల్ టాయిలెట్స్ 1, సీసీ రోడ్స్ 1 కె.యం, ఆజోలా కన్స్ట్రక్షన్స్ 20, పౌల్ట్రీ షెడ్ 1, ల్యాండ్ డెవలప్మెంట్ 15 ఎకరాలు, పెర్క్యులేషన్ ట్యాంక్ 5,బోర్ వెల్ రీఛార్జ్ 2, ఇరిగేషన్ ఓపెన్ వెల్స్ 1 మొత్తం 130 వర్క్స్ లకు అభివృద్ధి కార్యక్రమాలు గ్రామాల్లో చేపట్టటం జరుగుతుంది అని తెలియజేసిన నియోజకవర్గం ఎమ్మెల్యే.కొత్త యర్రబోయినపల్లి గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం లో చేపట్టిన గ్రామ అభివృద్ధి గ్రామ ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలం లో చేసిన సత్తుపల్లి నియోజకవర్గం అభివృద్ధి గురించి సంతృప్తి చెందుతూ, ప్రజలకు అందిన అందుతున్న పథకాలు గురించి వివరించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సంవత్సర పాలనా కాలంలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రజలు సంతృప్తిగా ఆనందంగా ఉన్నారు అని తెలియజేసిన ఎమ్మెల్యే . ఈ కార్యక్రమం లో కల్లూరు, పెనుబల్లీ ఏ యం సి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, సీనియర్ నాయకులు పసుమర్తి చంద్రరావు, ప్రభుత్వ అధికారులు ఆర్ డి ఓ ,ఎంపీడీఓడి ఆర్ డి ఈ,ఏ ఈ,సీడీపీఓ , అంగన్వాడీ సూపర్ వైజర్, పాఠశాల ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు, ఫీల్డ్ అసిస్టెంట్ మరియు కల్లూరు మండలం,యర్రబోయిన పల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# బాదాలో భారీగా పోలీసుల మోహరింపు

**ఆసిఫాబాద్, (ప్రభాత సూర్యుడు):** ఫుడ్ పాయిజన్‌తో మరణించిన వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ స్వగ్రామం బాదాలో పోలీసులు భారీగా మోహరించారు. శైలజ మృతదేహం ఆసిఫాబాద్ జిల్లా బాదా గ్రామానికి చేరుకున్నది. దీంతో ఆమె బంధువుల, గ్రామస్తులు అంబులెన్స్‌ను చుట్టుముట్టి నిరసన వ్యక్తం చేశారు. ఆమె డెడ్‌బాడీని అందులోని నుంచి దించకుండా అడ్డుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు వారందరిని అదుపులోకి తీసుకున్నారు. గ్రామాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని అడుగడుగునా మోహరించారు. గ్రామంలోకి ఇతరులు ఎవరూ రాకుండా పికెటింగ్ ఏర్పాటు చేశారు. సరైన ధృవపత్రాలు చూపిన తర్వాతే గ్రామానికి అనుమతిస్తున్నారు. మీడియాపై ఆంక్షలు విధించారు. కాగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్తున్న ఎమ్మెల్యే కోవా లక్ష్మిని కూడా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహం వ్యక్తంచేసిన ఎమ్మెల్యే.. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తనను ఎందుకు వెళ్లనీయడం లేదని ప్రశ్నించారు. బాదాకు వెళ్లడానికి ఎవరికీ అనుమతి లేదని స్పష్టం చేశారు. సోమవారం రాత్రి ఎమ్మెల్యే కోవ లక్ష్మి నివాసంలోకి చొరబడిన పోలీసులు అక్రమంగా హౌస్ అరెస్టు చేశారు.

# ఇందుగలడు.. అందు లేడని లేదు.. సర్వం అదానీ!

రాజకీయంగా దేశంలో రెండవ అతి పెద్ద రాష్ట్రం మహారాష్ట్రలో భారీ విజయ సాధించటంతో భారతీయ జనతా పార్టీ శ్రేణులు ఆనందోత్సహాలు జరుపుకుంటున్నాయి. ఇదే సమయంలో కేంద్రంలోని అధికార పార్టీకి అదానీ వ్యవహారం తల నొప్పిగా మారింది. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోడీకి గత కొన్నేళ్లుగా అదానీ విషయంలో ప్రతిపక్షాల నుంచి అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఇప్పుడు అమెరికాలో గౌతమ్ అదానీపై క్రిమినల్ కేసు నమోదు కావటంతో ఇక్కడ ప్రధానీ మోడీ పరిస్థితి ఇరకాటంలో పడ్డట్టైంది.
పార్లమెంటు శీతాకాల సమావేశాల తొలిరోజే ఉభయసభల్లో గందరగోళం చెలరేగింది. దీనిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ద్వారా విచారణ జరిపించాలని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది.
పార్లమెంటులో దీనిపై చర్చకు ప్రభుత్వం భయపడుతోందని విమర్శించింది. ఈ గందరగోళం మధ్య ఉభయ సభలు వాయిదాపడ్డాయి, తగిన వివరణ వచ్చేవరకు ఆందోళన కొనసాగిస్తామని కాంగ్రెస్ స్పష్టం చేసింది. అదానీ విషయంలో ప్రభుత్వ తీరును ఆప్, తృణమూల్ కాంగ్రెస్ వంటి ఇతర పార్టీల ఎంపీలూ తప్పుబట్టారు.
అదానీ కంపెనీలు కేంద్ర బిందువుగా గత నాలుగైదు రోజులుగా దేశవ్యాప్తంగా దుమారం రేగుతున్న విషయం తెలిసిందే. ఇక, రెండు తెలుగు రాష్ట్రాలలోనూ రాజకీయం అదానీ వ్యవహారం చుట్టే నడుస్తోంది. ఏపీ, తెలంగాణలో ఇప్పుడు ఈ వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది.
మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా పత్రికా సమావేశంలో.. అదానీ నుంచి తెలంగాణ ప్రభుత్వం విరాళం సేకరించడంపై కొందరు పాత్రికేయులు రాహుల్‌గాంధీని అడిగారు. ఒకపక్క సీఎం రేవంత్‌రెడ్డి విరాళాలు సేకరిస్తుంటే.. మరోపక్క మీరు ఎలా అదానీ తప్పులను ప్రశ్నిస్తారని రాహుల్ వద్ద ప్రస్తావించారు. ఇది తెలంగాణలో చర్చనీయమైంది. అదానీ విషయంలో తను గతంలోనే నేను వివరణ ఇచ్చానని... రాహుల్ కూడా అదానీపై తన పోరాటాన్ని విస్పష్టంగా ప్రజలకు వెల్లడించారని సీఎం రేవంత్ రెడ్డి చెబుతూ వస్తున్నారు. చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఏదైనా అంశంలో టెండర్లు పిలిస్తే.. అదానీనే కాదు.. అంబానీ, టాటా, బిర్లా వంటి వారు ఎవరైనాసరే.. నిబంధనల ప్రకారం ఆ టెండర్లను దక్కించుకుంటే.. వారికి రాజ్యాంగబద్ధమైన రక్షణ ఉంటుందని, వారు పెట్టుబడులు పెట్టడానికి అవకాశం ఉంటుందని రాహుల్‌గాంధీ స్పష్టంగా వివరించారు. అయినప్పటికీ బీఆర్ఎస్ పదే పదే అదానీ విరాళం వ్యవహారాన్ని ప్రస్తావిస్తోంది.
దీంతో సీఎం రేవంత్ రెడ్డీ గులాబీ నేతలపై ఎదురుదాడికి దిగారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అదానీ సంస్థలతో చేసుకున్న ఒప్పందాలు చాలానే ఉన్నాయని గుర్తుచేస్తున్నారు. అంతే కాదు 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'కి



అదానీ గ్రూప్ ఇస్తాన న్న రూ.100 కోట్ల విరాళాన్ని తెలంగాణ ప్రభుత్వం స్వీకరించడానికి సిద్ధంగా లేదని సీఎం ప్రకటించారు. పక్క రాష్ట్రాలు, దేశాల్లో అదానీ గ్రూప్ కంపెనీల విషయంలో జరుగుతున్నవివాదానికి.. తెలంగాణ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని రేవంత్ రెడ్డి స్పష్టంచేశారు. క, పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ లో కూడా అదానీ–జగన్ వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది. ఈ వ్యవహారంపై అధికార టీడీపీ ఎలా వ్యవహరిస్తుంది అనేది ఆసక్తిని కలిగిస్తోంది. రాష్ట్రంలో జగన్ రాజకీయ ప్రత్యర్థి కాగా..కేంద్రంలో బీజేపీ మిత్రపక్షంగా ఉంది. మెడీ, అదానీ అత్యంత సన్నిహితులు అనే విషయం బహిరంగ రహస్యమే. ఇప్పుడు దీనిపై పార్లమెంట్లో టీడీపీ ఎలా వ్యవహరిస్తుందో చూడాల్సి వుంది. కాగా. అదానీతో ఒప్పందానికి సంబంధించి జగన్‌మోహన్‌రెడ్డి తేలుకుట్టిన దొంగలా వ్యవహరిస్తున్నారని లెఫ్ట్ పార్టీలు మండిపడుతున్నాయి. ఈ ఒప్పందం వల్ల రాష్ట్ర ప్రజలపై రూ. లక్ష కోట్ల భారం పడుతుందని విమర్శిస్తున్నాయి. ప్రతిపక్షంలో ఉండగా దీనిపై విమర్శలు చేసిన తెదేపా నాయకులు ఇప్పుడు నోరెత్తకపోవటం విచిత్రంగా ఉంది. ఒప్పందంలో రూ. 2,029 కోట్ల అవినీతి ఉందని, అందులో రూ. 1,757 కోట్లు జగన్‌కు అందినట్లు అమెరికా న్యాయవిభాగం తేల్చిన విషయం తెలిసిందే. యూనిట్ రూ. 1.99కు వచ్చే విద్యుత్తును రూ. 2.49 చొప్పున కొనడానికి ఎందుకు ఒప్పందం చేసుకున్నారనేది ఆరోపణ. టీడీపీ సర్కార్ జగన్‌పై కనీస విచారణకు సిద్ధపడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలి. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు మౌనం వీడి జగన్‌పై చర్యలు తీసుకోవాలి. మరోవైపు, అదానీ కేసులో ఇప్పుడు మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. గౌతమ్ అదానీతో పాటు ఆయన సోదరుడి కుమారుడు సాగర్ అదానీకి యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ కమిషన్ (యూఎస్ ఎస్ఈసీ) సమన్లు జారీ చేసింది. సౌర విద్యుత్ కాంట్రాక్టులను పొందడానికి రూ.2,200 కోట్లు లంచం ఇచ్చారన్న ఆరోపణలపై తమకు వివరణ ఇవ్వాలని కోరింది. 21 రోజుల లోపు సమాధానం ఇవ్వాలని స్పష్టం చేసింది.నోటీసులకు స్పందించకపోతే తీర్పు వ్యతిరేకంగా వెలువడుతుందని యూఎస్ ఎస్ఈసీ హెచ్చరించింది. అదానీ వ్యవహారంలో ఆరోపణలు రుజువైతే..ఇటు ప్రజాకోర్టులో కూడాచాలా మందికి శిక్షలు తప్పవు!!



# మహాయుతిలో ముఖ్యమంత్రి పంచాయితీ

మహారాష్ట్ర సీఎం పదవిపై ఢిల్లీ పెద్దల కసరత్తు కొనసాగుతోంది. కానీ ఇప్పటి వరకు సీఎం పదవి కోసం పడిన పీటముడి వీడలేదు. చివరకు ఇది మహాయుతిలో ముసలం పుట్టిస్తుందా అనే అనుమానాలకు కలిగిస్తోంది. బిజెపి-శివసేన మధ్య విభేదాలు వచ్చే అవకాశం ఉన్నదా అనే అనుమానాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి ముఖ్యమంత్రిగా ఉన్న శివసేన నేత ఏక్‌నాథ్ షిండే, భాజపా తరఫున గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం కూడా ఉన్న దేవేంద్ర ఫడణవీస్ ఇద్దరూ కూడా ఇప్పుడు ముఖ్యమంత్రి పదవి కోసం గట్టిగా పోటీపడుతున్నారు. కూటమి చీలికను ఎవ్వరూ కోరుకోవడం లేదు గానీ.. అనివార్యమైన పరిస్థితి వస్తే.. ఆ సంభావ్యతను తోసిపుచ్చలేమని పరిశీలకులు భావిస్తున్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో అత్యధికంగా 132 సీట్లలో విజయం సాధించింది. మహాయుతి కూటమిలో కూడా వారి వాటా ఎక్కువ. కాబట్టి వారికే ముఖ్యమంత్రి పదవి దక్కాలనేది పలువురి వాదన. ఏక్‌నాథ్ షిండేకు ఒక అవకాశం ఇచ్చారు గనుక.. ఇప్పుడు ఆయన కూడా అవకాశం బిజెపికి ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలని కొందరు అంటున్నారు. రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే సత్తా ఫడణవీస్ కు ఉన్నదని ఆ పార్టీ వారు గట్టిగా పట్టుపడుతున్నారు. అయితే శివసేన వాదన ఇంకో రకంగా ఉంది. ఏక్‌నాథ్ షిండే ముఖ్యమంత్రిగా ఉండగా తీసుకున్న నిర్ణయాలు, అందించిన సుపరిపాలన కారణంగానే మహాయుతి కూటమి ఘనవిజయం సాధించిందని, ఆ వియాన్ని తోసిపుచ్చలేమని వారు అంటున్నారు. కాబట్టి షిండేనే కొనసాగించాలనేది వారి వాదన. షిండేని పక్కకు తప్పిస్తే గనుక.. భారతీయ జనతా పార్టీ మిత్ర పక్షాలను వాడుకుని, తాము బలపడిన తర్వాత వారిని కరివేపాకులు వాడుకుని వదిలేస్తుందని అనేక మంది చేసే ఆరోపణలే నిజమౌతాయని వారు చెబుతున్నారు. తద్వారా బిజెపిని డిఫెన్సులోకి నెడుతున్నారు. బలాబలాల ప్రకారంగా చూస్తే భారతీయ జనతా పార్టీకి 132 మంది సభ్యులున్నారు. అదే సమయంలో ఎన్సీపీకి ఉన్న బలం 41 స్థానాలు. శివసేన(షిండే) 57 స్థానాలలో గెలిచింది. పరిస్థితులు వికటిస్తే గనుక.. శివసేన లేకుండా కూడా ఎన్సీపీ మద్దతుతో భాజపా ప్రభుత్వం ఏర్పాటు చేయగలుగుతుంది. అయితే అలాంటి నిర్ణయం భాజపాకు అపరిమితమైన చెడ్డపేరు తెచ్చిపెడుతుంది. వారి విశ్వసనీయత దెబ్బతింటుంది. అందుకే కేంద్రంలోని పెద్దలు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. షిండే, ఫడణవీస్ ఇద్దరూ గట్టిగా పట్టుపడుతున్నందువల్ల.. మంగళవారమే కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావల్సి ఉండగా.. ఇంకా నిర్ణయం జరగలేదు. రాజీ కుదరకపోతే మైత్రిలో ముసలం పుడుతుందని కొందరు అంచనా వేస్తున్నారు.

# సీఎం కావాలనేది లోకేష్‌కు చిటికెలో పని!

టీడీపీ యువనేత సీఎం అవుతారా? ఈ అంశం గురించి చర్చకు ఇది సమయం కాకపోవచ్చు. ఎందుకంటే ఎన్నికలు జరిగి ఆరు నెలలు కూడా పూర్తి కాలేదు. అసలు లెక్క ప్రకారం చూస్తే.. వచ్చే ఎన్నికలు 2029 లో జరగాల్సి ఉంది. అప్పటికి ఇంకా చాలా సమయం ఉంది. అయితే డిప్యూటీ సీఎం హోదాలోని పవన్ కల్యాన్ రాబోయే పది సంవత్సరాలూ సీఎంగా చంద్రబాబు నాయుడే ఉండాలని ఆకాంక్షించిన విషయం తెలిసిందే. ఇది ఒక ఆసక్తికర చర్చకు దారి తీసింది. అయితే చంద్రబాబు నాయుడుకు ప్రజలు అయితే కూటమి ద్వారా ఇంకో అవకాశం ఇచ్చారు కాబట్టి, ఇంకో నాలుగున్నరేళ్లు ఆయన అధికారికంగా సీఎంగా కొనసాగవచ్చు. ఆ తర్వాత ఎన్నికలు జరగాల్సి ఉంది. జమిలి ఎన్నికల సంగతులను పక్కన పెడితే, 2029 వరకూ చంద్రబాబు నాయుడు సీఎంగా కొనసాగడానికి అవసరమైన మెజారిటీ అయితే టీడీపీ వద్ద ఉంది. ఒకవేళ ఏదైనా కారణం చేత ఈ కూటమి నుంచి పవన్ కల్యాణ్ బయటకు వచ్చినా, చంద్రబాబు నాయుడు సీటుకు అయితే ఎలాంటి ఇబ్బంది లేదు. ఆ మేరకు టీడీపీకి సొంత మెజారిటీ ఉంది. రాజకీయాల్లో ఎవరి వ్యూహాలు ఏ మేరకు ఎప్పుడు మారతాయో వేరే చెప్పనక్కర్లేదు. స్వయంగా చంద్రబాబు– పవన్ కల్యాణ్ ల స్నేహాన్నే ఇందుకు ఉదాహరించినా 2014 ఎన్నికల్లో వీరంతా కూటమిగా వెళ్లారు. ఆ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ పార్టీ పోటీ చేయలేదు, అయితే జనసేన అంటూ పార్టీ పెట్టి అప్పుడు చంద్రబాబు ను సీఎంగా చేయడానికి పవన్ చాలా కష్టపడ్డారు. అయితే అదే పవన్ కల్యాణ్ మనసు 2019 నాటికి మారిపోయింది. ఎర్ర పార్టీలతో జట్టు కట్టారు..ఫలితం కనిపించలేదు. దాంతో ఎరుపు కన్నా కాషాయమే బెటర్ అనుకుని తిరిగి పవన్ కల్యాణ్ కాషాయ కూటమిలో మళ్లీ చేరారు! ఃాబట్టి.. ఎరుపు, కాషాయం ఇలా ఎప్పుడు ఏ రంగులు అయినా మారిపోవచ్చు. కాబట్టి రాబోయే పదేళ్ల రాజకీయం గురించి పవన్ తన ఆకాంక్షను చెప్పేయడం కాస్త విచిత్రమే. అయితే ఇది పవన్ వీరాభిమానులకు మింగుడు పడదు. పవన్ కల్యణ్ సీఎం కావాలనేది ఆయన వీరాభిమానుల సుదీర్ఘ ఆకాంక్ష. తెలుగుదేశం చంద్రబాబే సీఎం అభ్యర్థిగా గత ఎన్నికలకు వెళ్లింది. అయితే ఆ పార్టీ యువ కిరణం లోకేష్ సీఎం కావాలని అక్కడా డిమాండ్ ఉంది. ఈ డిమాండు కూడా పాతదే. 2019 ఎన్నికలు పూర్తి కాగానే.. లోకేష్ సీఎం, ప్రధాన మంత్రిగా చంద్రబాబు, రాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు ఉంటారంటూ అప్పట్లో నే ప్రచారాలు మొదలుపెట్టారు. 2019 ఎన్నికల్లో టీడీపీ గెలుస్తుందని, కాంగ్రెస్ తో కలిసిన చంద్రబాబు చక్రం తిప్పి సీఎం అవుతారని దీంతో రెండు పదవుల్లో కొనసాగలేరుకాబట్టి.. లోకేష్ సీఎం అవుతారనేది అప్పుడు జరిగిన ప్రచారం. అయితే ఫలితాలు వేరేలా రావడంతో వారి కలలకు భంగం కలిగింది. ఆ సంగతలా ఉంటే.. ఒకవేళ 2029 నాటికి అయినా లోకేష్ ను టీడీపీ సీఎం క్యాండిడేట్ చేయాలనుకుంటే, లేదా



అంతలోపే సీఎం సీట్లో లోకేష్ ను కూర్చోబెట్టేసి ఎన్నికలకు వెళ్లాలని చంద్రబాబు భావిస్తే.. అప్పుడు పవన్ పరిస్థితి ఏమిటనేదే ఆసక్తదాయకమైన అంశం.ఇక, టీడీపీకి చంద్రబాబు తరువాత లోకేషే బాస్. పోటీదారు అనుకున్న జూనియర్ ఎన్టీఆర్ ను ఎప్పుడో సైడ్ చేశారు. కాబట్టి నిజంగా లోకేష్ కోరుకుంటే, ఏ ఆటంకం లేకుండా సీఎం అయిపోగలడు. ఒకవేళ తనకు వయసు మీద పడుతోందనో, లేక లోకేష్ ను ఎన్నికలకు ముందే సీఎంగా కూర్చోబెట్టేయాలనో చంద్రబాబు భావించినా ఆశ్చర్యం లేదు. అలాంటి పరిస్థితి ఇంకో రెండు మూడు సంవత్సరాల తర్వాత వచ్చినా అప్పుడు పవన్ కల్యాణ్ సమ్మతించక తప్పుతుందా అనేది ఆసక్తిదాయకమైన అంశం. అసలు పవన్ సమ్మతితో టీడీపీకి పని లేకపోవచ్చు. ఎందుకంటే పోటీ చేసింది కూటమిగానే కానీ, టీడీపీకి సొంత బలం ఉంది. సొంతంగా మెజారిటీకి కావాల్సినంతమంది ఎమ్మెల్యేలు ఉన్నారు. పార్టీ గీత దాటని వారే వారిలో ఎక్కువమంది. లోకేష్ సీఎం అంటే.. వారిలో చాలా మంది ఎగిరిగంతేస్తారు. కాబట్టి సీఎం కావాలనేది లోకేష్ కు చిటికెలో పని!

# భరోసా ఇచ్చేందుకు వెళ్తుంటే అడ్డుకోవడం సిగ్గుచేటు

## స్వేచ్ఛను హరిస్తే ఊరుకోం : హరీశ్‌రావు



**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** ఫుడ్ పాయిజన్‌తో చనిపోయిన వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవా లక్ష్మిని పోలీసులు అడ్డుకోవడంపై సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిడ్డను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ తల్లిదండ్రులకు భరోసా ఇచ్చేందుకు వారి గ్రామానికి వెళ్తున్న ఎమ్మెల్యేతోపాటు ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. తల్లిదండ్రుల ఆవేదనను ప్రపంచానికి చూపేందుకు వెళ్తున్న మీడియాను సైతం గ్రామానికి పది కిలోమీటర్ల దూరంలో బారికేడ్లు వేసి అడ్డుకోవడం అప్రజాస్వామికమని, మీడియా స్వేచ్ఛను హరించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాంకిడి గురుకుల విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడం ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమేనని చెప్పారు. ప్రభుత్వం తమ తప్పేం లేదన్నట్లు వ్యవహరించినంత మాత్రాన విద్యార్థిని ప్రాణం తీసిన పాపం ఊరికే పోదన్నారు. జాతీయ రాజ్యాంగ దినోత్సవం అంటూ దేశ వ్యాప్తంగా గొప్పగా జరుపుకుంటున్నాం కానీ, ఆ రాజ్యాంగ సూత్రాలను తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా తుంగలో తొక్కుతున్నదని మండిపడ్డారు. ప్రశ్నిస్తే కేసులు, గొంతెత్తితే దాడులు, ప్రజా ప్రతినిధుల హౌజ్ అరెస్టులు, మీడియాపై కఠిన ఆంక్షలని విమర్శించారు. ఇదేమి రాజ్యం రేవంత్ రెడ్డి అంటూ ఎక్స్ వేదికగా నిలదీశారు. వాంకిడి గురుకులంలో ఫుడ్ పాయిజన్ వల్ల బిడ్డను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ తల్లిదండ్రులకు భరోసా ఇచ్చేందుకు వారి గ్రామానికి వెళ్తున్న ఎమ్మెల్యే కోవా లక్ష్మి సహా ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం సిగ్గుచేటు.

Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad - 500 013 Telangana.
Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505, Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215